క్లుప్తంగా

సీఎం జగనన్నతోనే సంక్షేమం



పెనమలూరు: సీఎం జగనన్నతోనే ప్రజలకు సంక్షేమ పాలన అందుతుందని మంత్రి జోగి రమేష్ తనయుడు రాజీవ్ అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ యనమలకుదురు 13వ డివిజన్‌లో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో జగనన్న రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వారి గడపకు తీసుకు వెళ్లి అందించామన్నారు. జగనన్న పాలనలో అన్ని మైనార్టీలకు పూర్తి న్యాయం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈడే చాముండేశ్వరి, షేక్.అష్రఫ్, లతీఫ్, కోసూరి నరేష్‌కుమార్, వంకాయలపాటి ప్రవీణ్‌కుమార్, అనీల్‌రెడ్డి, ఇమ్రాన్, కరీం తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు సామాజిక బాధ్యత



ఉయ్యూరు: వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చటం సామాజిక బాధ్యత అని వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం అన్నారు. ఉయ్యూరు బస్టాండ్ సెంటర్‌లో దిరిశం సరోజిని ప్రభాకర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ దిరిశం జ్యోతిర్మయి, నాయకులు జంపాన కొండలరావు, పినమాల నాగకుమార్, ఎంజి రవి, కొండపల్లి రమేష్, బ్రహ్మం, కో ఆప్షన్‌సభ్యుడు షేక్ ఖలీల్, బాలి పాల్గొన్నారు.

11 మందికి హోమ్ ఓటింగ్ సదుపాయం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలం గన్నవరం నియోజకవర్గం గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతూ మంచంపై ఉంటున్న 11 మందికి హోమ్ ఓటింగ్ సదుపాయం కల్పించామని తహసీల్దార్, అదనపు ఎలక్టోరల్ రిటర్నింగ్ అధికారి పి.జాహ్నవి తెలిపారు. వారికి సెక్టార్ ఆఫీసర్ ద్వారా 12 డి ఫామ్ అందజేస్తామన్నారు.

విద్యార్థినులకు మానవత చేయూత

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వ్యాయామ విద్య అభ్యసిస్తున్న ఇద్దరు పేద విద్యార్థినులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందించింది. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన శ్యామల లక్ష్మీ ప్రసన్న, జొన్నాడ ధనలక్ష్మి ఇటీవల ఏలూరు జిల్లా దెందులూరు మండలం గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో డిప్లమో ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులో చేరారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఫీజులు చెల్లించేందుకు వీరిద్దరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మానవత సంస్థను ఆశ్రయించటంతో వీరిద్దరికి కోర్సు పూర్తి అయ్యే వరకు ప్రతి నెల రూ.5 వేలు చొప్పున ఆర్థికసాయాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు ఏడో నెల మెస్ చార్జీలను స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో వారికి చెరో రూ.5 వేలు చొప్పున ఆదివారం మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు కూరెళ్ల సుబ్బాచారి, ప్రధాన కార్యదర్శి కళ్లేపల్లి నారాయణరావు, కోశాధికారి ప్రాబోలు గణేష్, సీనియర్ సభ్యులు వడ్డి రాజేశ్వరరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, పొట్లూరి శేషాచలం, కొట్నాని రామచంద్రరావు పాల్గొన్నారు.

పెనమలూరు సర్పంచిపై దాడి కేసుల నమోదు

పెనమలూరు: పెనమలూరు సర్పంచి, ఆయన తనయుడిపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో ఆశ్రమం కాలువ కట్టపై వనమాల అంజి మరి కొందరు వ్యక్తులతో కలిసి బ్యాంకు జీరో అకౌంట్ తెరిస్తే రూ.2 వేలు అకౌంట్‌లో పడతాయని చెప్పి మహిళల ఆధార్‌కార్డు వివరాలు, వేలిముద్రలు సేకరించసాగారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న సర్పంచి లింగాల భాస్కరరావు, అతని కుమారుడు లింగాల వెంకటనాగసాయి కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి మహిళలకు అవగాహన కల్పించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడే ఉన్న వనమాల అంజి ఆగ్రహంతో సర్పంచ్ భాస్కరరావు, ఆయన కుమారుడిపై దాడి చేశాడు. ఈ ఘటన పై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు. తనపై సర్పంచి, ఆయన కుమారుడు దాడి చేశారని అంజి కూడా పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యం



దావాజిగూడెంలో ప్రజలకు అభివాదం చేస్తున్న వంశీమోహన్, పక్కన భరత్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు



బుద్ధవరంలో మహిళలతో మాట్లాడుతున్న వంశీమోహన్

- వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్
- బుద్ధవరం, దావాజిగూడెంలో ఎన్నికల ప్రచారం

బుద్ధవరం(గన్నవరం): రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ చెప్పారు. మండలంలోని బుద్ధవరం, దావాజిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం ఎస్టీబీఎల్ కాలనీ నుంచి ప్రారంభమైన ప్రచారం రాజీవ్‌నగర్, పామర్తినగర్, రమణమ్మ చెరువు మీదుగా దావాజిగూడెం వరకు కొనసాగింది. ఆయా ప్రాంత ప్రజలు వంశీమోహన్‌కు అపూర్వ స్వాగతం పలికారు. దారి పొడవునా మహిళలు ఆయనకు హారతులు పట్టారు.

టీడీపీని నమ్మి మరోసారి మోసపోవద్దు

ఈ సందర్భంగా వంశీమోహన్ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాల కొనసాగింపు కోసం ప్రజలందరూ వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ ఇచ్చిన 600కుపైన హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రం ప్రజలకు ఇచ్చిన ప్రతి ఎన్నికల వాగ్దానాన్ని నెరవేర్చి వారి అభ్యున్నతికి తోడ్పాటు అందించారని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో మహిళలకు పెద్దపీట వేయడంతో పాటు పేదల సొంతింటి కలను నెరవేర్చారన్నారు. గత ఐదేళ్లలో దావాజిగూడెంలో ఆర్అండ్‌బీ రోడ్డు, రాజీవ్‌నగర్ ప్రధాన రహదారి, పామర్తినగర్ వద్ద కల్వర్టు నిర్మాణం, పలు అంతర్గత రోడ్లను అభివృద్ధి చేశామని చెప్పారు. అధికారం కోసం బూటకపు హామీలు ఇస్తున్న టీడీపీని నమ్మి మరోసారి మోసపోవద్దని సూచించారు. పేదలకు అన్ని రకాలుగా అండగా నిలుస్తున్న వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు. ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, పార్టీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, ఉప సర్పంచ్ వేల్పూరు బసవరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు నక్కా కృష్ణయ్య, పార్టీ నాయకులు పడమట సురేష్, గొంది రాణి, గంతొటి రాజ్‌కుమార్, వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారంలో జననీరాజనాలు

గన్నవరం: ఎన్నికల ప్రచారంలో భాగంగా వంశీమోహన్ ఆదివారం సాయంత్రం దావాజిగూడెం, బుద్ధవరం గ్రామాల్లో పర్యటించారు. దావాజిగూడెం హైస్కూల్ నుంచి ప్రారంభమైన ప్రచారం పాలకేంద్రం, నాయీబ్రాహ్మణ వీధి, ఎస్సీ కాలనీలో కొనసాగింది. వంశీమోహన్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకుసాగారు. వీరిని గజమాలలతో సత్కరించడంతో పాటు అడుగడుగున అపూర్వ స్వాగతం పలుకుతూ గ్రామస్తులు తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. అనంతరం బుద్ధవరం గ్రామంలో వంశీ ప్రచారానికి గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు.

గడప గడపకూ అభివృద్ధి, సంక్షేమం

- రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్
- నియోజకవర్గంలో జోరందుకున్న ప్రచారం



తెన్నేరు ప్రధాన సెంటర్‌లో ప్రసంగిస్తున్న మంత్రి జోగి రమేష్



ఆకునూరులో మహిళలను ఆప్యాయంగా పలకరిస్తున్న మంత్రి జోగి రమేష్

కంకిపాడు: ప్రతి గడపకూ సంక్షేమం, అభివృద్ధి ఫలాలు చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు ఎమ్మెల్యే అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. మండలంలోని తెన్నేరు గ్రామంలో ఇంటింటి ప్రచారం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తాను ముందుండి పని చేస్తానని హామీ ఇచ్చారు. ఆయా కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ప్రధాన సెంటర్‌లో నిర్వహించిన సభలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. టీడీపీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజల్ని వంచించిందన్నారు. హామీలను బుట్టదాఖలు చేసి మోసం చేసిందని ఆరోపించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం వరకూ పూర్తి చేసి ప్రజా సంక్షేమానికి బాటలు వేసిన ఘనత సీఎం జగనన్నదేనన్నారు. పాలనలో నూతన సంస్కరణలు తీసుకొచ్చి, అన్ని వర్గాలకూ విద్య, వైద్యం చేరువ చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రగతికి బాటలు వేసిందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురద చిమ్ముతున్నాయని ఆరోపించారు. ఎల్లో మీడియా ప్రజల్ని గందరగోళానికి గురిచేస్తున్నాయని విమర్శించారు. వాస్తవాలను తెలుసుకోవాలని, ప్రతిపక్షాలకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి విజయాన్ని అందించాలని విజ్ఞప్తిచేశారు. టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ తనకు పోటీనే కాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాకీ బాబు, ఎంపీటీసీ ఉప్పలూరి శాంతి, సర్పంచ్ జుజ్జవరపు ఎలీషా, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, టిడ్కో, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లు పి.రాఘవరావు, నందిపాటి బిందుమాధవి, సొసైటీ అధ్యక్షుడు వీరంకి నరేష్, గ్రామ అధ్యక్షుడు మట్టా నాగరాజు, నాయకులు కలపాల వజ్రాలు, దండాబత్తిన సుబ్బారావు, ఉప్పలూరి సునీల్, లాం సురేష్, ఇంటూరి వెంకటేశ్వరరావు, ఇంటూరి నరేష్, కోటయ్య, ఓలేటి డేవిడ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకే ప్రజల మద్దతు

ఉయ్యూరు: వైఎస్సార్ సీపీకే మళ్లీ అధికారం ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర మంత్రి జోగి రమేష్ అన్నారు. ఉయ్యూరు మండలంలోని చిన ఓగిరాల, ఆకునూరు గ్రామాల్లో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. చిన ఓగిరాలలో బూత్‌కమిటీ సభ్యులు, పార్టీ నేతలతో సిద్ధం సమావేశం నిర్వహించారు. పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేసే అంశంపై దిశానిర్దేశం చేశారు. ఆకునూరు గ్రామంలో ఇంటింటి ప్రచారం సాగించారు. మంత్రి జోగి రమేష్ అందరినీ కలుస్తూ, అన్ని వర్గాలతో మమేకం అవుతూ, సంక్షేమ పథకాలను వివరిస్తూ విస్తృతంగా ప్రచారం సాగించారు. ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటూ, సమస్యలను ఆలకిస్తూ అక్కున చేర్చుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ రాష్ట్రానికి సీఎం కావాలనే ఆవశ్యకతను వివరించారు. కూటమి కుట్రలను వివరిస్తూ జగనన్నకు అండగా నిలవాలని కోరారు. ప్రచారంలో కేడీసీసీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, ఉక్కు కాకాని మనవడు కాకాని విజయ్‌కుమార్, పార్టీ నాయకులు దేవినేని గౌతమ్, దేవినేని స్మిత, పాలడుగు శివజ్యోతి, గారపాటి నాని, రమావత్ శ్రీకాంత్, మెరుగుమాల ఏసుబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ధనేకుల కాలేజీ డైరెక్టర్‌కు లైఫ్‌టైమ్ అవార్డు



పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో డైరెక్టర్ కెఆర్‌కె.రవిప్రసాద్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వచ్చింది. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఏపీసీటీఈ ప్రతినిధి డాక్టర్ బి.చంద్రశేఖర్, ఆంధ్రా యూనివర్సిటీ వీసీ డాక్టర్ ప్రసాద్‌రెడ్డి భారత్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డులో భాగంగా రవిప్రసాద్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం చేశారు. రీసెర్చ్, అండ్ ఎడ్యుకేషన్‌లో అందించిన ఉన్నత సేవలకు గాను ఈ అవార్డు వరించింది.

కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం భార్యను వేధిస్తూ, ఆమెపై దాడి చేసిన భర్తపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మురళీనగర్‌లో నివశిస్తున్న షేక్ తస్లీమాబేగంకు 10 ఏళ్ల క్రితం కట్నకానుకలు ఇచ్చి షేక్ షాబాజీతో వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త ఫ్లెక్సీల ప్రింటింగ్ షాపులో పని చేస్తాడు. కాగా భర్త దురలవాట్లకు బానిసగా మారి భార్యను అదనపు కట్నం తీసుకు రమ్మని వేధించసాగాడు. తస్లీమాబేగంపై దాడి చేసి చంపుతానని బెదిరించసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

‘చిరంజీవి వ్యాఖ్యలకు ప్రజలు ఛీ కొడుతున్నారు’

రామవరప్పాడు: జనసేన, బీజేపీ, టీడీపీ కూటమిగా ఏర్పడటం శుభపరిణామంటూ సినీ హీరో చిరంజీవి చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర ప్రజలు ఛీ కొడుతున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి సయ్యద్ నూరుద్దీన్ విమర్శించారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని మైనార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నూరుద్దీన్ మాట్లాడుతూ 2009లో సామాజిక న్యాయం పేరుతో ప్రజారాజ్యం పార్టీ పెట్టి గెలిచిన 18 మంది ఎమ్మెల్యేలను కాపాడుకోవాలని అసమర్థ నాయకుడు చిరంజీవి అన్నారు. పార్టీని నడపలేక కాంగ్రెస్‌కు హోల్‌సేల్‌గా అమ్మేసిన ఘనుడు చిరంజీవి ఇప్పుడు ప్రజా సంక్షేమంటూ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ, బీజేపీ దగ్గర ప్యాకేజీలతో పొత్తు పెట్టుకున్న తమ్ముడికి ఏ ముఖంతో మద్దతు పలుకుతున్నావని ప్రశ్నించారు. రాజకీయంగా వైఫల్యం చెందిన చిరంజీవికి, పవన్ కల్యాణ్‌కు ప్రజల్లో ఎటువంటి ఆదరణ లేదన్న విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. రాజకీయాలకు దూరంగా ఉన్నానని కల్లబొల్లి మాటలు చెప్పి ఇప్పుడు ఎందుకు మాట మార్చావో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిలకడ లేని అన్నదమ్ముల మాటలను ప్రజలు నమ్మబోరని, దొంగల ముఠా కూటమిలో ఎంత మంది కలిసి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండో సారి ముఖ్యమంత్రిని చేయడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

వంశీ గెలుపునకు సమన్వయంతో పని చేయాలి



ముస్తాబాదలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



అంబాపురంలో నాయకుల ఇంటింటా ప్రచారం

నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణుల విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న కొమ్మా కోటేశ్వరరావు

రామవరప్పాడు: వైఎస్సార్ సీపీ గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్‌ను భారీ మెజారిటీతో గెలిపించడానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని గొల్లపూడి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామగ్రామాన పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేపట్టారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో ఆదివారం ఎంపీటీసీ సభ్యురాలు నూకల విజయ సుగుణ నివాసం, పీఎస్ఆర్ కాలనీలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కొమ్మా కోట్లు మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో రూ.2 వేల కోట్లకు పైగా నేరుగా లబ్ధిదారులకు చేకూరిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పేద, బడుగు, బలహీనవర్గాలు అభివృద్ధి చెందాయన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు తమ తమ పరిధిలోని బూత్‌లను పర్యవేక్షించి పార్టీ సిద్ధాంతాలు, నవరత్న పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన పరచాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. టీడీపీ నాయకులు ఓటర్లను ప్రభావితం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని వీటిని మనందరం కలిసి తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా జగనన్న అందించిన పాలన, సంకల్పాన్ని ప్రతి గడపకూ తీసుకెళ్లాలన్నారు. పేదల ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చి జగన్‌ను రెండోసారి ముఖ్యమంత్రిగా, నియోజకవర్గంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వల్లభనేని వంశీమోహన్‌ను హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని స్పష్టం చేశారు. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు, సర్పంచ్ వరి శ్రీదేవి, పేరంటాలమ్మ ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, గన్నవరం నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ మెరుగు సుధాకర్, రూరల్‌మండల యువజన ఉపాధ్యక్షుడు వేములపల్లి రవి, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అంబాపురంలో ప్రచారం

అంబాపురం(విజయవాడరూరల్): గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం అంబాపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాల రథసారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వంశీమోహన్‌ను, ఎంపీ అభ్యర్థి డాక్టర్ సంహాద్రి చంద్రశేఖరరావును ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను ప్రజలకు అందజేస్తూ ప్రతి ఇంటిలో ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. పైపుల రోడ్డు సమీపంలో అంబాపురం 1వ వార్డులో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్, కో కన్వీనర్ తోడేటి బెంజిమెన్, నాయకులు తోడేటి కిరణ్, కొడాలి భరత్, పల్లా సతీష్, యలమర్తి కృష్ణ, గొడ్డళ్ల రోజామణి పాల్గొన్నారు.

గడప గడపకు విస్తృత ప్రచారం..

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద గ్రామంలో ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ ఆ పార్టీ నాయకులు గ్రామంలో గడప గడపకు విస్తృత ప్రచారం నిర్వహించారు. మండల పార్టీ జేసీఎస్ కన్వీనర్ కైలే శివకుమార్ పాల్గొని మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎంపీగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును, ఎమ్మెల్యేగా డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌ను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలను మరింతగా పొందేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలన్నారు. రాష్ట్రంలో ఒకేసారి 32 లక్షల మందికి పైగా పేదలకు నివేశన స్థలాలు ఇచ్చి జగనన్న కాలనీల పేరుతో ఊళ్లు నిర్మించిన ఘనత జగన్ మోహన్‌రెడ్డిదని చెప్పారు. వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు షేక్ మున్ని, మాజీ సర్పంచ్ కైలే ఆదిలక్ష్మి, నాయకులు కూరేటి శ్రీకాంత్, బూత్ కన్వీనర్లు షేక్ సలాం, షరీఫ్, ఆజం, మధు పాల్గొన్నారు. పార్టీ ప్రచార కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రచారానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది.